# వినతిపత్రం ఇవ్వలేని నిర్బంధమా?

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సహా పార్టీ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
- పోలీసుల తీరుపై హరీశ్ ఫైర్



హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా ఇతర నాయకులను నిర్బంధించటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వలేని నిర్బంధం కొనసాగుతున్నదని మండిపడ్డారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ చేసిన మోసంపై ఆదివారం వరంగల్ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టిని కలిసి వారికి రిప్రజెంటేషన్ ఇచ్చే ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా పార్టీ నేతలను పోలీసులు నిర్బంధించటం అత్యంత దుర్మార్గమని నిప్పులు చెరిగారు. ఎకరాకు రూ. 7,500 ఇస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై యావత్ తెలంగాణ రైతాంగం చీదరించుకుంటున్నదని విమర్శించారు. రైతులు ఎక్కడ తిరగబడతారోనని మంత్రుల పర్యటనల్లో భారీగా పోలీసులను మోహరించి ఎన్నాళ్లు తప్పించుకుంటారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ఎండగడుతూనే ఉంటామని, ఎక్కడికక్కడ నిలదీస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు. సుదర్శన్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రజా పాలన కాదు.. పోలీసు పాలన

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది ఫైర్
- బీఆర్ఎస్ కార్యాలయాన్ని చుట్టుముట్టిన పోలీసులు
- నాయకుల నిర్బంధం

హనుమకొండ, జనవరి 5 : రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదని, పోలీసు పాలన కొనసాగుతున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రైతు భరోసా అమలుపై సీఎం రేవంత్ ప్రకటన నేపథ్యంలో ఆదివారం ఆయన హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు 15 వేలు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు 12 వేలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనన్నారు. వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు.



హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

### బీఆర్ఎస్ నేతల నిర్బంధం

హనుమకొండ, జనవరి 5: వరంగల్ పర్యటనకు వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలవడానికి అనుమతి ఇవ్వాలని సీపీని మీడియా ముఖంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి అభ్యర్థించడమే ఆలస్యం.. వెంటనే పోలీసు బలగాలు వాలిపోయి బీఆర్ఎస్ కార్యాలయాన్ని చుట్టుముట్టాయి. నాయకులు కార్యాలయం నుంచి బయటికి రాకుండా గేట్లను మూసి వేశారు. డిప్యూటీ సీఎం పర్యటన సాగినంత సేపు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ రెడ్డి, పులి రజినీకాంత్, రామ్మూర్తి, రజిత, జ్యోతి తోపాటు పార్టీ శ్రేణులను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్బంధించారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 6.0°c | 35.9°c |
| రంగారెడ్డి | 7.9°c | 35.5°c |
| మెదక్ | 10.7°c | 36.5°c |
| నిజామాబాద్ | 14.1°c | 30.2°c |
| మహబూబ్‌నగర్ | 14.5°c | 29.0°c |
| కరీంనగర్ | 15.0°c | 30.0°c |
| హైదరాబాద్ | 15.2°c | 29.6°c |
| వరంగల్ | 16.0°c | 27.0°c |
| నల్లగొండ | 16.0°c | 29.5°c |
| ఖమ్మం | 17.0°c | 29.0°c |



# రాష్ట్రంపై చలిపంజా

- సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ
- వచ్చే మూడ్రోజులు మరింత చలి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి పంజా విసురుతున్నది. చలిగాలులకు జనం గజగజ వణుకుతున్నారు. నాలుగు రోజులుగా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. 15 జిల్లాల్లో 10 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8గంటలు దాటినా మంచు, చలి తీవ్రతతో ప్రజలు ఇంట్లోంచి బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో కనిష్ఠంగా 5.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో 6, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.1, ఖమ్మం జిల్లా తల్లాడలో 7.4, రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 7.9, నిర్మల్ జిల్లా పెంబిలో 8, కామారెడ్డి జిల్లా డోంగ్లిలో 8.3, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో 9.2, వికారాబాద్ జిల్లా కోట్‌పల్లిలో 9.3, మంచిర్యాల జిల్లా నెన్నెలలో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. సూర్యాపేట జిల్లా మినహా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు అధికారులు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీచేశారు. నిరుటితో పోలిస్తే అన్ని జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పడిపోయినట్టు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో చలితీవ్రత ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు సంగారెడ్డి జిల్లాలో చలితీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలుగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలుగా నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



హైదరాబాద్ హైటెక్స్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సన్మానిస్తున్న అప్టా ప్రతినిధులు

# ఐక్యతతోనే రాజ్యాధికారం

- మున్నూరుకాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి
- అప్టా సదస్సులో ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): కాపులంటే అన్నదాతలని, పదిమందికి సాయం చేసేవారని, ఆర్థికంగా ఎదిగిన తర్వాత ప్రతిఒక్కరూ ఇతరులకు అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో క్యాటలిస్ట్ పేరిట నిర్వహించిన మూడురోజుల అతర్జాతీయ సదస్సులో ఆదివారం వద్దిరాజు పాల్గొని మాట్లాడారు. మున్నూరుకాపులు విద్య, ఉద్యోగరంగాల్లో రాణించినా వ్యాపారవేత్తలు, రాజకీయవేత్తలుగా ఎదగలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అప్టా సదస్సు సందర్భంగా అప్తులందరం ఒకచోట సమావేశమైనట్టుగా ఉన్నదని, క్యాటలిస్టును వచ్చేసారి క్యాపటలిస్ట్ పిలుచుకుందామని, ఆర్థికంగా మరింత ఎదుగుదామని పిలుపునిచ్చారు. తన తండ్రి వద్దిరాజు నారాయణ 55 ఏండ్ల కిందట రైస్ మిల్లును ప్రారంభించారని, ఆయనిచ్చిన ధైర్యం, చూపిన మార్గంలో ముందుకు సాగి గ్రానైట్ వ్యాపారంలో గొప్పగా రాణిస్తున్నానని చెప్పారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధ్యమవుతుందన చెప్పారు. ఈ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతోపాటు అమెరికా నుంచి సుమారు 5,000 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఎంపీ రవిచంద్ర కుమారుడు నిఖిల్ చంద్ర, కోడలు అనీల, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, మున్నూరుకాపు ప్రముఖులు కొండా దేవయ్య, సీ విఠల్, రౌతు కనకయ్య, ఎం సుధీర్‌కుమార్, ఆకుల రజిత్‌కుమార్, డాక్టర్ పీఎల్ఎన్ పటేల్, ఊసా రఘు, ఆర్వీ మహేందర్, కొత్త లక్ష్మణ్, తెల్లా మురళీధర్, భేతి శ్రీధర్, మామిడి అశోక్, బాపట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏడంతస్తుల భవనం నేలమట్టం

మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు • అయ్యప్పసొసైటీలో అక్రమకట్టడాలే • హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఏడంతస్తుల భవనాన్ని కూల్చివేస్తున్న హైడ్రా బుల్డోజర్

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, జనవరి 5(నమస్తే తెలంగాణ): మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో హైడ్రా బాహుబలి బుల్డోజర్ హల్‌చల్ చేసింది. సొసైటీలోని ఏడంతస్తుల భవనాన్ని ఆదివారం కూల్చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామం మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని సర్వే నంబర్ 11/5లో ప్లాట్ నంబర్ 5/13 పేరిట 684 గజాల స్థలంలో 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకొని చేపట్టిన ఏడంతస్తుల (సెల్లార్ నుంచి జీ ప్లస్ 5) భవనాన్ని హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు నేలమట్టం చేయించారు. జీహెచ్ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను ఖాతరుచేయకుండా సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్ సహా ఏడంతస్తులు నిర్మించడంపై స్థానికుల ఫిర్యాదు మేరకు కూల్చివేసినట్టు హైడ్రా అధికారులు తెలిపారు. కూల్చివేత నేపథ్యంలో భవనం వద్ద భారీగా పోలీసులు, హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించారు. శనివారమే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఎలాంటి సెట్ బ్యాక్ వదలకుండా, పార్కింగ్ సౌకర్యం, ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోకుండా సెల్లార్‌లోనే కిచెన్ నిర్మాణానికి ఏర్పాట్లు చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. భవన యజమానులు ఎవరి ఉత్తర్వులనూ లెక్కచేయకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే భవనాన్ని కూల్చేయాలని జీహెచ్ఎంసీతోపాటు కలిసి హైడ్రా బృందాన్ని ఆదేశించారు. దీంతో హైడ్రా బృందం ఆదివారం ఉదయమే అయ్యప్ప సొసైటీకి చేరుకొని మొదట సాధారణ క్రేన్‌తో కూల్చివేతలు ప్రారంభించింది. మధ్యాహ్నం సమయంలో బాహుబలి బుల్డోజర్ వచ్చి నేలమట్టం చేసింది. కాగా ఎలాంటి అనుమతులు లేకుండా భవనం మొదలుపెట్టి ఏడంతస్థులు పూర్తి చేసేదాకా జీహెచ్ఎంసీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సొసైటీలో దాదాపు అక్రమ కట్టడాలే: రంగనాథ్

అయ్యప్ప సొసైటీలో చాలావరకు అక్రమకట్టడాలే ఉన్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటిపై జీహెచ్ఎంసీ కమిషనర్‌తో సమీక్షిస్తామని, కూల్చివేతలకు సంబంధించి హైకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలుంటే వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయ్యప్ప సొసైటీలో వందల మంది విద్యార్థులు, ఉద్యోగులు పలు అక్రమకట్టడాల్లో నివసిస్తున్నారని, ఆయా భవనాలకు ఫైర్‌సేఫ్టీ, నిర్మాణ అనుమతులు లేవని వివరించారు. అక్రమ నిర్మాణాలతో మురుగునీటి వ్యవస్థ కూడా బాగా దెబ్బతిన్నదని, మలమూత్రాలు రోడ్డుపైకి వస్తున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని, సహకరించిన అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి రిపోర్ట్ పంపుతామని వెల్లడించారు.

# బీసీబంధుపై విచారణ పిడుగు

మొదటిపేజీ తరువాయి...

యూనిట్లను వెనక్కితీసుకుంటుందేమోననే భయం వారిలో కనిపిస్తున్నది. వృత్తులను నమ్ముకొని బతుకుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం బీసీ బంధును ప్రారంభించింది. ఈ స్కీం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందజేసింది. ఎలాంటి షరతులు విధించకుండానే నగదు మంజూరు చేసింది. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 350 మంది చొప్పున, మొత్తంగా సుమారు 40 వేల మందికి యూనిట్లను పంపిణీ చేసింది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా స్కీంను నిలిపేసింది. ఎన్నికల ముందర ఈ పథకాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు విచారణ పేరిట ఇక్కట్లకు గురిచేయడంపై లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

### ఇంటింటికీ వెళ్లి యూనిట్ల వివరాలపై ఆరా

సర్కారు ఆదేశాల మేరకు పట్టణాల్లో వార్డు ఆఫీసర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బీసీ బంధు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. 'నగదును ఏ యూనిట్ కోసం ఖర్చుచేశారు? లేదంటే సొంత అవసరాలకు వినియోగించుకున్నారా? ఇందుకు సంబంధించి బిల్లులు ఉన్నాయా?' అంటూ ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు. యూనిట్ల వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. కొందరు సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవాలు చెప్పకపోతే ప్రభుత్వం పైసలు వాపస్ తీసుకుంటుందని బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏడాదిన్నర క్రితం ఇచ్చిన నగదుకు ఇప్పుడు వివరాలు అడగమేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు డు ఎలాంటి షరతులు పెట్టకుండానే నగదును తమ ఖాతాల్లో జమ చేశారని, ఇప్పుడు ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడో ఖర్చు చేసిన వివరాలు, బిల్లులు కావాలని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని మండిపడుతున్నారు. సర్కారు వైఖరిపై బీసీ సంఘాల నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత సర్కారు వర్తింపజేసిన పథకాలను సైతం గుంజుకొనేందుకు యత్నించడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. విచారణ పేరిట లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని హెచ్చరిస్తున్నారు.

# సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

**నేటి నుంచి 19 వరకు రాకపోకలు**

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 52ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. 6 నుంచి 19 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతామని పేర్కొన్నారు. చర్లపల్లి-తిరుపతి, వికారాబాద్-కాకినాడ, కాచిగూడ-తిరుపతి, నర్సాపూర్-చర్లపల్లి, సికింద్రాబాద్-కాకినాడ, నాందేడ్-కాకినాడ, చర్లపల్లి-శ్రీకాకుళం స్టేషన్ల మధ్య ఈ రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని తెలిపారు. వివరాలకు ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

# నల్లగొండ గుండెలపై మళ్లీ ఫ్లోరైడ్ బండ!

- మర్రిగూడ మండలంలో డెంటల్ ఫ్లోరోసిస్, ఎముకల (స్కెలటల్) ఫ్లోరోసిస్ కేసులు
- యువత, పిల్లల్లో విస్తృత వ్యాప్తి!
- తక్షణం మేల్కోకపోతే పెనుముప్పు
- ఆందోళన కలిగిస్తున్న తాజా సర్వేలు
- నాడు మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరోసిస్‌ను తరిమి వేసిన కేసీఆర్
- పార్లమెంట్ సాక్షిగా వెల్లడించిన కేంద్రం
- నేడు మిషన్ భగీరథపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం
- మళ్లీ పడగ విప్పుతున్న ఫ్లోరైడ్ భూతం



మర్రిగూడెం మండలంలో సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): నల్లగొండ గుండెలపై మళ్లీ ఫ్లోరైడ్ బండ పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తరిమేసిన ఫ్లోరైడ్ పీడ కాంగ్రెస్ సర్కార్ పుణ్యమా అని మళ్లీ వంకర్లు తిరిగి దర్శనమిస్తున్నది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో డెంటల్ ఫ్లోరోసిస్ కేసులతోపాటు ఎముకల (స్కెలటల్) ఫ్లోరోసిస్ కేసులు మళ్లీ నమోదవుతున్నట్టు ఇటీవలి సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టిన ఇంటెన్సివ్ సర్వేలో స్కెలటల్ ఫ్లోరోసిస్ కేసులు వెలుగుచూశాయి. ప్రజారోగ్యం పట్ల కాంగ్రెస్ సర్కార్ చిత్తశుద్ధిలేమికి పరాకాష్టగా కొత్త కేసులు సవాలు విసురుతున్నాయి. మూడేండ్ల క్రితం ఫ్లోరైడ్ పీడ నుంచి విముక్తి పొందిన నల్లగొండ తాజా పరిణామాలతో ఉలిక్కిపడుతున్నది. వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల 34,800 మందితో ఇంటింటి సర్వే నిర్వహించింది. ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహించిన ఈ సర్వేలో వృద్ధుల్లో స్కెలటల్ ఫ్లోరోసిస్ కేసుల సంఖ్య అంతగా లేకపోయినా, యువత, పిల్లల్లో విస్తృత వ్యాప్తి చెందుతున్నట్టు వెల్లడి కావడం ఆందోళన కలిగిస్తున్నది.

### తక్షణం మేల్కోకపోతే...

ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల్లో స్కెలటల్, డెంటల్ ఫ్లోరోసిస్ కేసులు పెరుగుతున్నాయనే అనుమానంతో నల్లగొండ జిల్లా యంత్రాంగం తాగునీటి సరఫరా తదితర అంశాల ప్రాతిపదికన అధ్యయనం చేసింది. మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో ఇటీవల అవాంతరాలు కలుగుతున్నాయని, ఫలితంగా కలిగే అనర్థాలను ముందస్తుగా అంచనా వేయాలని వైద్యాధికారులు నిర్ణయించారు. అధ్యయనం రిపోర్టును అధికారికంగా బయటికి వెల్లడించకపోయినప్పటికీ సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు ఫ్లోరోసిస్ ప్రభావ తీవ్రతను పసిగట్టారని, అందులో భాగంగానే ఇంటింటి ప్రజారోగ్య సర్వే నిర్వహించారని తెలుస్తున్నది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటిలో కలుషితాలు ఉన్నట్టు గుర్తించారు. దీని ప్రభావంతో తక్షణం ఆందోళనకరమైన పరిస్థితులు లేకపోయినా, ఫ్లోరోసిస్ విజృంభణ పెరిగి దీర్ఘకాలంలో తీవ్ర సమస్యగా పరిణమించే అవకాశాలు లేకపోలేదని సర్వేలో బయటపడుతున్న విషయాలను విశ్లేషిస్తున్నారు. అయితే, ఇప్పటికిప్పుడు గట్టి చర్యలు తీసుకుంటే నివారణ గతంలో ఉన్నంత పెద్ద సమస్యగా ఉండకపోవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

### ఫ్లోరైడ్ లేదని ప్రకటించిన కేంద్రం

పార్లమెంట్ వేదికగా 2020 నుంచి 2022 వరకు అనేక పర్యాయాలు తెలంగాణను ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2022 పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన మంచినీటి సరఫరాతో ఒక్క ఫ్లోరైడ్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్రం ప్రకటించింది.

- 2014లో 413 మందికి 1.5 పీపీఎం కంటే ఎక్కువ ఫ్లోరిన్ శాతం ఉండేది. ప్రతి సంవత్సరం ఈ సంఖ్య అంతకంతకూ తగ్గుతూ 2020 నాటికి అది పూర్తిగా లేకుండాపోయిందని నివేదికలు స్పష్టంచేశాయి. సురక్షితమైన మంచినీళ్లు తాగడంవల్లే ఫ్లోరైడ్ రావడంలేదని నిర్ధారించారు. గతంలో పిల్లల పళ్లపైనా గారలు కనిపించేవి. కానీ ఈ మధ్య కాలంలో అలాంటి లక్షణాలు కనిపించడంలేదని ఆ నివేదికలు తేటతెల్లం చేశాయి.

### ఇదీ ఫ్లోరైడ్ భూతాన్ని తరిమేసిన వైనం

- 2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టిన తరువాత అస్తిత్వ జెండా ఎత్తిన రెండేండ్లకే 2003 ఆగస్టు 25 నుంచి 30 వరకు ఐదు రోజుల పాటుకోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపట్టారు.
- కరీంనగర్ ఎంపీగా ఉన్నా 2006లో ఫ్లోరైడ్ రక్కసిని రూపుమాపేందుకు ప్రచార, చైతన్యకార్యక్రమాలు నిర్వహించారు. ఆ సమయంలోనే 'చూడు చూడు నల్లగొండా..ఎద మీదా ఫ్లోరైడ్ బండా..' పాటను స్వయంగా కేసీఆర్ రాసి ఫ్లోరైడ్ రక్కసిపై విస్తృత కార్యాచరణకు నడుంకట్టారు. చౌటుప్పల్, నారాయణపురం, కొత్తగూడెం, వావిళ్లపల్లి, అంతంపేట, మర్రిగూడం, నాంపల్లి, చండూరు, కనగల్ మీదుగా నల్లగొండకు పాదయాత్ర సాగింది. మర్రిగూడెంలోని ప్రవాస భారతీయుడు వైకే రెడ్డి బంధువు అనంతరెడ్డి ఇంట్లో కేసీఆర్ బసచేశారు. జలసాధన సమితి నాయకుడు దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి నాయకుడు కంచుకుంట్ల సుభాష్ మొదలైన వారితో సుదీర్ఘంగా చర్చించారు.
- 'నల్లగొండ నగారా' పేరుతో, 2007 ఏప్రిల్ 24న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఫ్లోరైడ్ పై యుద్ధాన్ని ప్రకటించారు.
- ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం ఫ్లోరైడ్ ప్రభావిత మర్రిగూడ ప్రాంతంలో పర్యటించింది. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్న దశ అది. సీమాంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులకు నాటి ఎమ్మెల్యే కేటీఆర్ నల్లగొండ ఫ్లోరైడ్ కష్టాలను వివరించారు.


### రాష్ట్ర ఆవిర్భావం తరువాత

తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ మునుగోడు నియోజకవర్గంలో చౌటుప్పల్‌లో 2015 జూన్ 8న మిషన్ భగీరథ పైలాన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రమంతటా మిషన్ భగీరథ తలపెట్టిన కేసీఆర్ దానికి ఆరంభంగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాన్నే ఎంచుకున్నారు. 2017లో అందరికీ నల్లా నీళ్లు అందించాలనే విషయమై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చర్చ జరిగినప్పుడు నదీ జలాలను ఇంటింటికీ ఇవ్వాలని ఒక్క తెలంగాణ తప్ప మరే రాష్ట్రమూ డిమాండ్ చేసే ధైర్యం చేయలేదు. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తింది నాటి టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే అన్న సత్యం నేటి సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా కేసీఆర్‌పై నోరుపారేసుకోవడం అవివేకానికి పరాకాష్ట అని తెలంగాణవాదులు పేర్కొంటున్నారు. ప్రధాని మోదీ మిషన్ భగీరథ పథకాన్ని ప్రశంసించారే కానీ, దీని అమలుకు నీతి ఆయోగ్ సిఫారసు చేసిన రూ.19 వేల కోట్లు ఇవ్వకుండా మొహం చాటేశారు.

### ఇదీ నల్లగొండ ఫ్లోరోసిస్ చరిత్ర

- హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న మునుగోడులో స్వాతంత్ర్యానికి పూర్వమే 1937లో తొలిసారి ఫ్లోరోసిస్ కేసు వెలుగు చూసింది.
- నిజాం ప్రభుత్వంలో శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ ఎంకే దాహుర్ 1945లోనే మర్రిగూడ మండలంలో ఫ్లోరైడ్ ఉన్నట్టు గుర్తించారు. ఈ ప్రాంతాలకు ఉపరితల నీటిని సరఫరా చేయాలని సిఫారసు చేశారు. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు నిజాం నవాబు చర్లగూడ, ఇబ్రహీంపట్నం, పసునూరు, తంగెడిపల్లి, మునుగోడులో చెరువులు నిర్మించినా వరుణుడు కరుణించకపోవడంతో ఆ ప్రయత్నాలు విఫలయ్యాయి. ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ మర్రిగూడ మండలం భట్లపల్లిలో (28 పీపీఎం) ఉన్నట్టు 1985లో గుర్తించి ప్రకటించారు.
- ప్రధానమంత్రులు ఐకే గుజ్రాల్, చంద్రశేఖర్ మొదలుకొని వాజ్‌పేయి దాకా, రాష్ట్రపతులు శంకర్‌దయాళ్ శర్మ నుంచి ఏపీజే అబ్దుల్ కలాం దాకా.. ఫ్లోరోసిస్ బాధితులు అందరినీ కలిశారు.
- ఫ్లోరైడ్‌పై పోరుకోసం జలసాధనసమితి, ఫ్లోరైడ్ విముక్తి సమితి ఇలా అనేక సంఘాలు, సంస్థలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించాయి. 1996 పార్లమెంటు ఎన్నికల్లో 480 మంది జలసాధన సమితి సభ్యులు పోటీలో నిలిచి ఫ్లోరైడ్ సమస్యను ప్రపంచం దృష్టికి తెచ్చారు.
- 2003 మార్చి 12న నల్లగొండ జలసాధన సమితి ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామిని అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి ముందు టేబుల్ మీద పండుకోబెట్టినా ఫ్లోరోసిస్ సమస్యకు పరిష్కారం చూపలేదు.

## పోరాటం ఇంకా మిగిలే ఉంది



ఫ్లోరోసిస్‌పై పోరాటం ముగిసిపోలేదు. ప్రభుత్వం చూపాల్సిన స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం ప్రయత్నాలు చేయాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 59 మండలాలు 3,477 ఆవాస గ్రామాలకు క్రమం తప్పకుండా మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది జలాలను తాగునీరుగా ఇవ్వాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, అన్నిస్థాయిల పాఠశాలలకు, హాస్టళ్లకు సరఫరా చేయాలి. ఫ్లోరోసిస్ శాశ్వత పరిష్కారం కోసం తాగునీటితోపాటు శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పూర్తిచేసి డిండి ఎత్తిపోతల ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని గొట్టిముక్కల కృష్ణరాయన్‌పల్లి, శివన్నగూడెం ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేయాలి. యాదాద్రి- భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని మల్కాపురంలో ఫ్లోరైడ్, ఫ్లోరోసిస్ మెటిగేషన్ సెంటర్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి. పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఫ్లోరోసిస్ బాధితులకు ప్రతి నెల రూ.15 వేల పింఛన్ ఇవ్వాలి. నల్లగొండ జిల్లాలోని అన్ని వాటర్ ప్లాంట్లను మూసివేయాలి.

– డాక్టర్ కంచుకట్ల సుభాష్, రాష్ట్ర కన్వీనర్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి


# నేడు చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

**వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ**

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే పరిధిలో రూ.413 కోట్లతో కొత్తగా నిర్మించిన చర్లపల్లి టెర్మినల్‌ను సోమవారం ప్రారంభించనున్నారు. టెర్మినల్‌ను భారత ప్రధానమంత్రి మోదీ వీడియో కాన్ఫరెన్సు(వర్చువల్)ద్వారా ప్రారంభించనున్నట్టు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ హాజరుకానున్నారు.

### ఏడాది ఆలస్యంగా ప్రారంభం

చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్ 2023 డిసెంబర్‌లో ప్రారంభం కావాల్సి ఉంది. అందుకు ప్రణాళికలు కూడా రూపొందించుకున్నారు. కాని అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు అలసత్వాన్ని ప్రదర్శించారని, దీంతో టెర్మినల్ ప్రారంభం ఆలస్యమైనట్టు కొందరు రైల్వే అధికారులు అభిప్రాయపడుతున్నారు.



ముంజంపల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత

# కాంగ్రెస్‌లో మహిళలకు గౌరవం లేదు

**మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత**

మానకొండూర్ రూరల్, జనవరి 5: కాంగ్రెస్‌లో మహిళలకు గౌరవం లేదని, జిల్లా కమిటీలో ఉన్నా ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఇదేం తీరు అని మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల కవిత ఆవేదన వ్యక్తంచేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ముంజంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మానకొండూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ క్రమంలో మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల కవిత పార్టీ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో తనకు అవమానం జరిగిందని, ఈ విషయమై ఏ ఒక్కరూ స్పందించలేదని ఎమ్మెల్యే ముందే ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారు మహిళలను విస్మరించేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.